క్లుప్తంగా

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత


మృతుని భార్య వాకాడ నిర్మలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ : పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. నాతయ్యపాలేనికి చెందిన వాకాడ శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. అతనిది పేద కుటుంబ కావడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి తమను ఆదుకోవాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు. అయితే శ్రీనివాసరెడ్డి చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయన వైద్య చికిత్స కోసం మంజూరైన రూ.2లక్షల చెక్కును మృతుని భార్య నిర్మలకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో మద్ది శంకర్‌రెడ్డి, పిట్టా సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ నూతన కార్యవర్గం


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలేనికి చెందిన వాసవీ క్లబ్–2023 సంవత్సరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో జరిగిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షునిగా ఉద్దగిరి కృష్ణకుమార్ గుప్తా, కార్యదర్శిగా నున్న గాంధీ గుప్తా, కోశాధికారిగా ఆత్మూరి లక్ష్మీనరసింహారావులను ఎన్నుకున్నారు. వాసవీ క్లబ్ విశాఖ జిల్లా గవర్నర్ కందుల నాగరాజు నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వాసవీ క్లబ్ నిర్వహించిన సేవా కార్యక్రమాల్లో భాగంగా అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ పాఠశాలకు కుర్చీలు అందజేశారు. అనంతరం వాసవీ క్లబ్ నూతన క్యాలెండర్‌ను జిల్లా గవర్నర్‌తో పాటు క్లబ్ ప్రతినిధులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొల్లూరు కామరాజు, మహేశ్వరరావు, ముక్కు శ్రీనివాసరావు, ఏవీ గుప్తా, కటకం శైలజ, చుక్కా బంగారాజు, వరదా కృష్ణ, రమేష్, కట్టా సతీష్, నంబూరి జగన్నాథరావు, శింగంశెట్టి సతీష్ పాల్గొన్నారు.

కాలినడకన శబరిమల వెళ్లొచ్చిన సత్తిరెడ్డికి సత్కారం


సత్తిరెడ్డిని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతలపూడి, కరణంరెడ్డి నర్సింగరావు

పెదగంట్యాడ : మొక్కు తీర్చుకునేందుకు 1600 కిలోమీటర్లు కాలినడకన శబరిమల వెళ్లి రావడమంటే మాటలు కాదని మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. జీవీఎంసీ 74వ వార్డు పరిధి సిద్ధేశ్వరానికి చెందిన సత్తిరెడ్డి అనే వ్యక్తి 43 రోజులపాటు కాలినడకన శబరిమల వెళ్లారు. అక్కడ అయ్యప్పస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించి తిరిగి వచ్చారు. ఈ నేపథ్యంలో ఆయనను ఆదివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జాగారపు శ్రీను, గంధం సాయి, గొందేశి సత్యారావు, పిట్టా మహేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నంలో ఆర్ట్ ఎగ్జిబిషన్ నేడు

గోపాలపట్నం: మహాత్మా గాంధీ వర్ధంతి, కుష్టు వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా గోపాలపట్నం ఆళ్వార్ దాస్ కళాశాలలో సింహాచలం యోగా విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో సోమవారం ఆర్ట్ ఎగ్జి బిషన్ జరుగుతుందని ఆ సంస్థ వ్యవస్థాపకుడు బీబీ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రదర్శన ప్రారంభమవుతుందన్నారు.

స్టీల్‌ప్లాంట్ కోసం గర్జిద్దాం రండి

- ఉక్కునగరం త్రిష్టా మైదానంలో నేడే ప్రజా గర్జన
- నిర్వాసితకాలనీల్లో పాదయాత్రలతో విస్తృత ప్రచారం


జీవీఎంసీ 77వ వార్డులో పాదయాత్ర చేస్తున్న అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు


ప్రజా గర్జనను విజయవంతం చేయాలని అగనంపూడి నిర్వాసితకాలనీల్లో పాదయాత్ర చేస్తున్న నిర్వాసిత, కార్మిక సంఘాల నేతలు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం నామమాత్రపు ధరకు భూములు ఇస్తే వాటితో కేంద్ర ప్రభుత్వం నేడు వ్యాపారం చేయాలని చూస్తోందని, దీన్ని అడ్డుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అగనంపూడి అఖిలపక్షాల నాయకులు ఇల్లపు ప్రసాద్, నెల్లి శ్రీనివాసరావు, కర్రి దేశేంద్రరావు, గవర సోమశేఖర్ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా జీవీఎంసీ 79, 85వ వార్డుల్లోని అగనంపూడి నిర్వాసితకాలనీలు, పరిసర ప్రాంతాల్లో ఉక్కు పరిరక్షణ కమిటీ, నిర్వాసిత ఐక్య వేదిక, అఖిలపక్షాల నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం పాదయాత్ర చేపట్టారు. ఉక్కునగరంలోని త్రిష్టా మైదానంలో సోమవారం నిర్వహించనున్న ప్రజా గర్జనను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లాభాల్లో ఉన్న విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పిచాలని, పదవీ విరమణ పొందిన, మృతి చెందిన కార్మికుల ఖాళీలను భర్తీ చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్లకార్డులతో నినాదాలు చేస్తూ నిర్వాసితులకు అవగాహన చైతన్య ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పిల్లా కొండలరావు, బలిరెడ్డి సత్యనారాయణ, జె.అయోధ్యరామ్, కరణం పైడిరాజు, పెదిరెడ్ల నీలకంఠం, మోటూరి వెంకటరమణ, వంకర రాము, ఉరివిటి మరిడయ్య, గెద్దాడ అప్పలరాజు, బొట్టా గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సోమవారం ఉక్కునగరంలోని త్రిష్టా మైదానంలో నిర్వహించనున్న ప్రజా గర్జనను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రవి, సీఐటీయూ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రామస్వామి, పోరాట కమిటీ నాయకుడు శ్రీనివాసరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని ఇస్లాంపేట జంక్షన్ నుంచి నమ్మిదొడ్డి మీదుగా దేవాడ జంక్షన్ వరకూ అఖిల పక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలు చేశారు. ఉక్కు గర్జనకు ఉక్కు ఉద్యోగులు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.


స్టీల్‌ప్లాంట్ గేటు వద్ద ప్రచారం చేస్తున్న నాయకులు


ఉక్కునగరం చర్చి వద్ద ప్రచారం చేస్తున్న నాయకులు

ఉక్కు గర్జనకు తరలిరండి

గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఉక్కునగరంలో సోమవారం నిర్వహించనున్న ప్రజా గర్జనకు ప్రజలు భారీ సంఖ్యలో తరలి రావాలని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ పరిశ్రమ తెలుగు ప్రజల త్యాగాలకు ప్రతి రూపమని, ఎందరో రైతులు తమ జీవితాలను పణంగా పెట్టి చేసిన త్యాగానికి నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. అటువంటి పరిశ్రమను ప్రైవేటు వ్యక్తులకు అమ్మేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం దారుణమని, ఈ దారుణాన్ని అడ్డుకోవడం కోసం, విశాఖ ప్రజల గర్జన ఢిల్లీకి వినిపించడం కోసం ప్రజా గర్జనను జయప్రదం చేయాలని కోరారు. విశాఖ, గాజువాక ప్రజలు, స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులు, వివిధ పరిశ్రమల కార్మికులు భారీగా ఈ కార్యక్రమానికి తరలి రావాలని పిలుపునిచ్చారు.

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరగనున్న ప్రజాగర్జన విజయవంతం చేయాలని ఉక్కు కార్మికులు కోరారు. ప్రజా గర్జన విజయవంతం కోసం పోరాట కమిటీ నాయకులు, కార్మికులు స్టీల్‌ప్లాంట్ లోపల, వెలుపల విస్తృతంగా ప్రచారం చేశారు. ప్లాంట్‌లోని అన్ని విభాగాల్లో, అన్ని షిఫ్ట్‌లలో కార్మికులను కలిసి తమ కుటుంబ సభ్యులతో గర్జనకు హాజరు కావాలని కోరారు. ప్లాంట్ ఉంటేనే ఉద్యోగాలు ఉంటాయని కార్మికులకు తెలిపారు. ప్లాంట్ ప్రభుత్వ రంగంలో ఉంటేనే నిర్వాసితులకు ఉపాధి లభిస్తుందన్నారు. ప్రజా గర్జన విజయవంతం చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి తమ నిరసన తెలపాలని కోరారు. మెయిన్ గేటు వెలుపల, ఉక్కు విస్తరణ ప్రాంతం, హిల్ టాప్ కూడలి, రైతు బజార్, ప్రార్థన మందిరాల వద్ద ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులను కలిసి ప్రజా గర్జన విజయవంతం చేయాలని కోరారు.

కూర్మన్నపాలెం : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభించి రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ జె.అయోధ్యరామ్ ... జెర్రిపోతుల ముత్యాలు అన్నారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 717వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో భాగంగా విశాఖ సిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొంపా గోవింద్, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పాల్గొని మాట్లాడారు. ప్రజా సంపద విశాఖ ఉక్కు కార్మాగారం అని, దీన్ని కాపాడకోవటానికి రాజీలేని పోరాటం చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఉక్కు ఉద్యమంలో భాగంగా జనవరి 30న ఉక్కు త్రిష్టా గ్రౌండ్స్‌లో జరపతలపెట్టిన ఉక్కు ప్రజా గర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేఎస్ఎస్ రావు, నెల్లి శ్రీనివాస్‌రావు, కొవిరి కోదండరావు, జగన్, యరబాల భూలోక, కట్టా అప్పారావు, ఎమ్. వర్మ, రామారావు, కొవిరి దేముడు, బసా రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థికి సత్యసాయి సేవా సమితి సాయం


పేద విద్యార్థికి సాయం అందజేస్తున్న సత్యసాయి ప్రతినిధులు

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి సేవా సమితి పేద విద్యార్థికి ఆర్థిక సాయం అందజేసింది. ఆదివారం సత్యసాయి సేవా కేంద్రంలో సాధన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులతో ప్రతిజ్ఞ నిర్వహించారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా ఇంజనీరింగ్ రెండవ సంవత్సరం చదువుతున్న పేద విద్యార్థి శ్యామ్ కుమార్‌కు రూ. 20 వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆధ్యాత్మిక కో–ఆర్డినేటర్ జె. సూర్యనారాయణ మాట్లాడుతూ ఆధ్యాత్మికత, నైతిన విలువలు, సామాజిక సేవ ధ్యేయంగా సేవాదళ్ ప్రతినిధులు పని చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ జి. రామకృష్ణ, ఆర్‌ఏ నాయుడు, కేఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ బంగారుమాంబ అమ్మవారి పరస


శ్రీ బంగారుమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, గోవిందరెడ్డి


విద్యుత్ దీపాల వెలుగులో స్టాళ్లు, జనసందోహంతో ఆలయ పరిసరాలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెం గ్రామ దేవత శ్రీ బంగారుమాంబ అమ్మవారి పరస మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన మహోత్సవంలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి బంగారుమాంబ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఏపీ అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బోగాది సన్యాసిరావు కుటుంబ సమేతంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలన్నీ విద్యుత్ దీపాల కాంతులతో నిండిపోయాయి. స్టాళ్లన్నీ కొనుగోలుదారులతో సందడి చేశాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు బంగారు శ్రీను, గవర వెంకటరమణారావు, పల్లెల శ్రీనివాసరావు ఆలయానికి వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు గంధ్రెడ్డి రామునాయుడు, సంధ్రాన చినసన్యాసిరావు, రంగనాయకులు, బోగాది అప్పారావు, ఉపమాక, బోనెల జోసెఫ్, గోపిశెట్టి గోపి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు త్వరలో అవగాహన సదస్సు


సమావేశంలో మాట్లాడుతున్న భాస్కరరావు

గాజువాక : పదో తరగతి విద్యార్థులకు వచ్చేనెలలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేట్ పాఠశాలల సంఘం (జిప్సా) అధ్యక్షుడు పి.భాస్కరరావు తెలిపారు. ఆదివారం నిర్వహించిన ఆ సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పాఠశాలల నిర్వహణకు అవసరమైన అన్ని రికార్డులను పాఠశాలల యాజమాన్యాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. డీసీఈబీకి పరీక్ష ఫీజుల చెల్లింపు, ఎల్‌కేజీ, యూకేజీల గుర్తింపు, పాఠశాలల అప్‌గ్రెడేషన్, రెన్యువల్, ఆన్‌లైన్ హాజరు నమోదు, ఆర్టీఈ యాక్టులను ఈ సందర్భంగా వివరించారు. ఈ సందర్భంగా క్రమశిక్షణ సంఘాన్ని ఏర్పాటు చేశారు. జిప్సా ప్రతిష్ఠకు ఏ సభ్యుడి ద్వారా భంగం వాటిల్లకుండా ఈ కమిటీ పర్యవేక్షిస్తుందని తెలిపారు. జిప్సాను త్వరలోనే రాష్ట్ర సంఘంతో అనుసంధానం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిప్సా కార్యదర్శి బి.శ్రీనివాసరావు, నాయకులు డి.శ్రీనివాస్, జగన్, రమేష్‌నాయుడు, వాసుదేవరావు, బాబూరావు, షన్ముఖరావు, మౌళి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్నకు ఆర్జిత సేవలు


స్వామికి యజ్ఞోపవీతం సమర్పిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి నిర్వహించారు. విశేషంగా హారతులు ఇచ్చారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు చక్రవర్తి, అప్పాజీ పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం అట్టహాసంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం జరిపారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

పాత గాజువాక బస్ స్టేషన్ పరిశీలన

గాజువాక : ఆర్టీసీ విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.రవికుమార్ పాతగాజువాక బస్ స్టేషన్‌ను ఆదివారం సందర్శించారు. నూతనంగా ప్రారంభించిన ఈ స్టేషన్‌లో నిర్వహించాల్సిన కార్యకలాపాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని కార్గో పార్శిల్ కార్యాలయాన్ని పరిశీలించారు. గాజువాక నుంచి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పార్శిళ్ల బుకింగ్, వచ్చిన వాటిని ఆయా బుకింగ్‌దారులకు అందజేసేందుకు పాటించాల్సిన మెలకువలను వివరించారు. వివిధ మార్గాలు, ఊరి పేర్ల ప్రకారం పార్శిల్స్, కొరియర్లను ఏ విధంగా భద్రపరచాలన్న విషయాలను తెలియజేశారు. నూతనంగా నిర్మిస్తున్న ప్లాట్‌ఫారంల విషయంలో చేయాల్సిన మార్పులను వివరించారు. గాజువాక డిపో మేనేజర్ ప్రవీణ, అసిస్టెంట్ మేనేజర్ మాధవి తదితరులు తాము చేపట్టిన పనులను ఈడీకి వివరించారు.

సమర్థంగా జై బీజేపీ యాప్ వినియోగం


సమావేశంలో పాల్గొన్న నర్సింగరావు తదితరులు

గాజువాక : జై బీజేపీ యాప్‌ను పార్టీ కార్యకర్తలు సమర్థంగా వినియోగించుకోవాలని ఆ పార్టీ గాజువాక కో ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు కోరారు. జీవీఎంసీ 67వ వార్డు బీజేపీ బూత్ కమిటీ సభ్యులతో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ సానుభూతిపరుల వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. గాజువాక నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందడానికి బీజేపీ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో శంకరరావు, ప్రసాద్ శర్మ, నాగేశ్వరరావు, గీత, స్వర్ణ, ప్రభావతి, సూర్యనారాయణ, బాల, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

పైడిమాంబ సమైక్యతా సంక్షేమ సంఘం అధ్యక్షునిగా 'మంత్రి'



పెదగంట్యాడ : జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని నడుపూరు పైడిమాంబ సమైక్యత సంక్షేమ సంఘం నూతన కమిటీ అధ్యక్షునిగా మంత్రి శంకరనారాయణ ఎన్నికయ్యారు. సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం నడుపూరులో ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా తాటికొండ సుదర్శనరావు ఎన్నికయ్యారు.

బైక్ ఢీకొని ఒకరికి గాయాలు

కూర్మన్నపాలెం : రోడ్డు దాటుతున్న వ్యక్తిని వేగంగా వస్తున్న బైక్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వుడానగర్‌కు చెందిన కట్టా అర్జున్ ఆదివారం సాయంత్రం హెయిర్ కటింగ్ కోసం సెలూన్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో వుడానగర్ జంక్షన్‌లో రోడ్డు దాటుతుండగా వీఎస్ఈజెడ్ నుంచి వేగంగా బైక్‌పై వస్తున్న అగనంపూడి ప్రాంతానికి చెందిన జానా విజయ్‌కుమార్ బలంగా ఢీకొట్టాడు. దీంతో అర్జున్ తలకు తీవ్ర గాయాలవడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సమాచారం అందుకున్న దువ్వాడ పోలీసులు కట్టా అర్జున్‌ను చికిత్స నిమిత్తం షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భౌగోళిక అంశాలపై పట్టు అవసరం

తగరపువలస: భౌగోళిక అంశాలపై విద్యార్థులు పట్టు సాధించాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. చిట్టివలస హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు అమలు చేస్తున్న వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఆదివారం ఆమె తరగతి గదిని సందర్శించారు. ఈ సందర్భంగా సోషల్ స్టడీస్ బోధన జరుగుతుండగా మ్యాప్‌లో భౌగోళిక అంశాలను గుర్తించడం కాకుండా నేరుగా మ్యాప్ గీయడంలో నైపుణ్యత సాధించాలన్నారు. ఇటీవల ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో పంపిణీ చేసిన ట్యాబ్‌ల వినియోగంపై ఉపాధ్యాయులకు అవగాహన కలిగించారు.

లంకెలపాలెంలో వారపు సంత ప్రారంభం


లంకెలపాలెంలో వారపు సంతను ప్రారంభిస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్

అగనంపూడి: జీవీఎంసీ 79, 85 వార్డుల్లో విస్తరించి ఉన్న లంకెలపాలెంలో ఆదివారం సంత (వారపు సంత)ను పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు ఆదివారం ప్రారంభించారు. లంకెలపాలెం రైల్వే క్రాసింగ్ వంతెన దిగువ భాగంలో హైస్కూల్‌కు సమీపంలోని ఖాళీ స్థలంలో ఈ వారపు సంతను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ లంకెలపాలెం గ్రామం చుట్టూలే అవుట్లు అధికంగా ఏర్పాటు కావడంతో వేలాది నిర్మాణాలు చోటు చేసుకున్నాయని, దీంతో జనాభా రెట్టింపు కావడంతో స్థానికంగా కూరగాయలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు వారపు సంతను ఏర్పాటు చేయడం శుభ పరిణామన్నారు. స్థానికులకు తక్కువ ధరకు, నాణ్యమైన కూరగాయలు అందుబాటులో ఉంటాయన్నారు. తరువాత కూరగాయల స్టాళ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 86, 79 వార్డుల కార్పొరేటర్లు ఇల్లపు వరలక్ష్మి, రౌతు శ్రీనివాసరావు, 79వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు, ఎంఐఎస్ డైరెక్టర్ శీరం నదియా, సీనియర్ నాయకులు ఇల్లపు ప్రసాద్, సుందరపు అప్పారావు, కింతాడ ఈశ్వరరావు, కర్రి నరసింగరావు, యలమర్తి వెంకటరావు, దాసరి తాతారావు, ప్రకాష్, కాతా నూకేష్, హ్యూమన్ రైట్స్ కమిషన్ కార్యదర్శి ఆశాజ్యోతి, నెల్ల కన్నబాబు, కాశీరావు తదితరులు పాల్గొన్నారు.

వేటూరి పాటలు అజరామరం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విజయ నిర్మాణ్ కంపెనీ అధినేత విజయ్‌కుమార్

సీతంపేట: తెలుగు భాష ఉన్నంత వరకు వేటూరి పాటలు ప్రజల హృదయాల్లో నిలిచి పోతాయని విజయ నిర్మాణ్ కంపెనీ అధినేత ఎస్.విజయ్ కుమార్ అన్నారు. ఆత్రేయ స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రఖ్యాత సినీ గేయ రచయిత వేటూరి సుందరరామ్మూర్తి 88వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సినీ సంగీత దర్శకుడు పాలగుమ్మి రాజగోపాల్ మాట్లాడుతూ 'సినీ కళామతల్లి నుదుట సింధూరం, అలనాటి వాగ్గేయకారులు త్యాగయ్య, అన్నమయ్య, భక్తరామదాసుల ఏక అవతారమే వేటూరి' అని కీర్తించారు. ఈ సందర్భంగా ఝుమ్మంది నాదం పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆద్యంతం అలరించింది. ఆత్రేయ పీఠం ప్రధాన కార్యదర్శి గంటి మురళి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసిని, కొణతాల రాజు, మహమ్మద్ ఖాన్, ఫణిస్వామి, చెన్నా తిరుమలరావు, ఎస్.ఎస్.ఎన్.రాజు, టి.రాధారాణి పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


నమ్మివానిపేటలో ప్రచారం చేస్తున్న ప్రతినిధులు

తగరపువలస: పద్మనాభం మండలం విజయరాంపురం ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞాన వేదిక ప్రతినిధులు ఆదివారం జీవీఎంసీ రెండో వార్డు నమ్మివానిపేట, సంగివలస గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మనిషి ఉదయం నిద్ర లేచినప్పటి నుంచి రాత్రి మళ్లీ నిద్ర పోయే వరకు ఎన్నో ఆలోచనలు, సుఖదుఃఖాలు, ప్రయాసలకు లోబడి సంపాదనే ధ్యేయంగా తృప్తి లేకుండా గడుపుతున్నాడన్నారు. గీత జ్ఞానం ప్రకారం కర్మ విధానం తెలుసుకుని మోక్షం ద్వారా జనన, మరణ చక్రం నుంచి విముక్తి పొందాలని ప్రచారం చేశారు. కమిటీ సభ్యులు కె.త్రినాథరావు, వి.సురేష్, ఎస్.శ్రీనివాస్, బి.అంకమ్మ, ఆదమ్మ, కె.సత్యవతి, కె.లక్ష్మి పాల్గొన్నారు.